సాక్షి సంగారెడ్డి

బుధవారం । 2 । అక్టోబర్ । 2024



పూలు అధరహో

బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా జిల్లాలో పూలకు భారీ డిమాండ్ పెరిగింది. వివరాలు 10లో ▸



గ్రీనరీ పేరుతో ప్రజాధనం వృథా

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి బల్దియాలో అవినీతి రాజ్యమేలుతోంది. గ్రీనరీ పేరుతో ప్రజాధనం వృథా చేస్తున్నారు. వివరాలు 10లో ▸



నాడు దర్జాగా.. నేడు దీనంగా

పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఒకప్పుడు దర్జాగా వెలుగొందిన 'దర్జీ'ల బతుకులు నేడు వెలవెలబోతున్నాయి. వివరాలు 10లో ▸

న్యూస్‌రీల్

వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్



వయోవృద్ధుడిని సన్మానిస్తున్న అడిషనల్ కలెక్టర్, అధికారులు

సంగారెడ్డి జోన్: జిల్లాలోని వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం కృషి చేస్తోందని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో వయోవృద్ధుల దినోత్సవం వేడుకలను నిర్వహించారు. వయోవృద్ధులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోవృద్ధులు ఎంతో అనుభవం గలవారిని, వారు చూపిన బాటలో నడుచుకోవాలని పేర్కొన్నారు. వయోవృద్ధుల పోషణ, ఆరోగ్య సమస్యలను పట్టించుకోకపోతే కుటుంబ సభ్యులకు చట్ట ప్రకారం జరిమానాతో పాటు శిక్ష విధిస్తామని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి బి.రమేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్యాధికారి డా. గాయత్రి దేవి, మెప్మా పీడీ గీత, తదితరులు పాల్గొన్నారు.

నల్లవాగుపై సర్కార్ వివక్ష

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టు రైతుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం నల్లవాగు ప్రాజెక్టును సందర్శించారు. కుడి కెనాలు ఆయకట్టు పరిధిలో సుల్తానాబాద్, గోసాయిపల్లి, బీబీపేట్, మార్డి, ఖానాపూర్ (కె), కృష్ణాపూర్, కల్హేర్ గ్రామాలలో పొలాలకు సాగునీటిని విడుదల చేయాలని రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారని తెలిపారు. రైతుల కష్టాలు పట్టించుకోకుండా ఎడమ కెనాలు ద్వారా కామారెడ్డి జిల్లాకు చెందిన నీటిని విడుదల చేస్తున్నారని మండిపడ్డారు. కుడి కెనాలు పరిధిలోని గ్రామాల రైతుల పంటలు ఎండబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్ రాంసింగ్, మాజీ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ అలీ, మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు పండరీ, ప్రశాంత్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఓపెన్ పరీక్షలు

కొండాపూర్(సంగారెడ్డి): ఓపెన్ ఇంటర్, పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ నెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. పదో తరగతికి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 1,052 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ఇంటర్ విద్యార్థులు 733, పదో తరగతి విద్యార్థులు 319 మంది ఉన్నారు. పదో తరగతి సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, ఇంటర్ సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను పరీక్ష కేంద్రాలుగా కేటాయించారు.

మంత్రి సురేఖపై అసత్య ప్రచారం తగదు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: మంత్రి కొండా సురేఖపై సోషల్ మీడియాలో కొంత మంది అసత్య ప్రచారం చేయడంతో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దుబ్బాకలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో మంత్రికి ఎంపీ రఘునందన్‌రావు నూలుపోగుల దండతో సన్మానించారని, దీనిపై సోషల్ మీడియాలో వక్రంగా ప్రచారం చేయడం తగదన్నారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

డబుల్‌పై నజర్

- 85 శాతానికి పైగా పూర్తయిన గృహాలు: 312
- మిగతా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశం

సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్ పేట్‌లో సుమారు 50 డబుల్ బెడ్‌రూమ్ గృహాల నిర్మాణం పూర్తయింది. కానీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాల పనులు పెండింగ్‌లో ఉండటంతో ఈ గృహాలను లబ్ధిదారులకు పంచలేదు.

నారాయణఖేడ్‌లో 68 డబుల్ బెడ్‌రూం నిర్మాణం పనులు కూడా సుమారు పది శాతం మిగిలి ఉన్నాయి. చిన్న చిన్న సివిల్ పనులు పెండింగ్‌లో ఉండటంతో ఈ గృహాలను లబ్ధిదారులకు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది.



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఇలా పనులు పూర్తయినప్పటికీ పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూం గృహాలను, అలాగే 85 శాతానికి మించి పనులు పూర్తయిన గృహాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. వీలైనంత త్వరగా ఈ ఇళ్ల నిర్మాణం పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలనే యోచనలో ఉంది. ఇలా జిల్లాలో 85 శాతానికి మించి పనులు పూర్తయిన గృహాలు దాదాపు 312 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ డబుల్ బెడ్‌రూం గృహాల పథకాన్ని గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేసిన విషయం విదితమే. ఈ డబుల్ బెడ్‌రూం గృహాలు మంజూరైనప్పటికీ., పనులు పూర్తి చేయకపోవడంతో సగానికి పైగా గృహాలు అలాగే వదిలేశారు. దీంతో ఈ గృహాలు చాలా చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిలో నివాసం ఉండలేని పరిస్థితికి దారితీస్తోంది. ఈ నేపథ్యంలో చివరి దశలో ఉన్న ఈ గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తే బాగుంటుందనే సర్కారు భావిస్తోంది. 85 శాతం పూర్తయిన గృహాలను మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఇటీవల జరిగిన సమీక్షలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గృహ నిర్మాణశాఖతో పాటు, సంబంధిత ఇంజనీరింగ్ విభాగాలకు ఆదేశాలు జారీ చేసింది.

చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు

డబుల్ బెడ్‌రూం కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. ఇప్పటికే చేసిన పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని చెల్లిస్తేనే మిగిలిన పోయిన పనులను పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు తేల్చి చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ పనులకు రెండేళ్లుగా బిల్లులు రాలేదు. దీంతో ఇప్పుడు ఈ పనులు చేయడం మాకు వీలు కాదని అధికారులకు చెబుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

డబుల్ బెడ్‌రూం కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. 85 శాతం వరకు జరిగిన పనులకు ముందుగా పెండింగ్ బిల్లులు ఇచ్చి, ఆ గృహాలను పూర్తి చేయించాలని భావిస్తోంది.

జిల్లాలో 'డబుల్' లెక్కలివి..

జిల్లాకు మంజూరైన డబుల్ బెడ్‌రూం గృహాలు :	5,934
అధికారులు టెండర్లు పిలిచినవి:	5,725
పనులు ప్రారంభమైనవి	5,108
నిర్మాణం పూర్తయినవి	4,194
లబ్ధిదారులకు పంపిణీ చేసినవి	4,146
పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నవి	48
85 శాతానికి మించి పూర్తయినవి	312
పనులు కొనసాగుతున్నవి	602
పనులు ప్రారంభం కానివి	826

అదనంగా 480 బస్సులు

దసరా పండుగకు ప్రత్యేక సర్వీసులు

- 1.25 రేషియోలో చార్జీలు అధికం
- ప్రతి బస్టాండ్‌లో ప్రత్యేక కౌంటర్
- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత



సంగారెడ్డి టౌన్: దసరా పండుగను పురస్కరించుకొని ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న బస్సులతో అదనంగా 480 బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. మంగళవారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు బస్సులను నడిపేందుకు ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. మంగళవారం ఆర్ఎం సాక్షితో మాట్లాడారు. విద్యాసంస్థలకు సెలవులు, దసరా సందర్భంగా రద్దీ పెరిగే అవకాశం ఉందని, అందుకే అదనంగా బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం పేర్కొన్నారు. పండుగ సందర్భంగా సొంతూరుకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ప్రతి బస్టాండ్‌లో సమాచారం నిమిత్తం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎనిమిది డిపోల నుంచి నిత్యం 556 బస్సులు వివిధ ప్రాంతాల ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. రద్దీని దృష్టిలో పెట్టుకొని అదనంగా బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ బస్సులు హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, లింగంపల్లి నుంచి సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, పిట్లం, సిద్దిపేట, మెదక్ తదితర పట్టణాలకు ప్రయాణికుల అవసరం మేరకు బస్సులను నడపనున్నట్లు ఆమె వివరించారు. అయితే.. ప్రత్యేక బస్సులకు టికెట్ ధర పెంచామని, 1.25 రేషియోలో (రూ.10 ధర ఉంటే దానిపై అదనంగా రూ.2) చార్జి ఉంటుందన్నారు. గతం కంటే ప్రయాణికుల సంఖ్య పెరిగిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతిరోజు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 2.70 లక్షల మందికిపైగా ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారని ఆర్ఎం తెలిపారు. త్వరలో డిపో మేనేజర్, కండక్టర్, డ్రైవర్ పోస్టుల నియామకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇంత వరకు రీజియన్ పరిధిలో కొత్త బస్సులు రాలేదన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ప్రభులత కోరారు.

ఊరెళ్తున్నారా?.. జర జాగ్రత్త

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్



సంగారెడ్డి జోన్: బతుకమ్మ, దసరా పండుగను పురస్కరించుకొని పట్టణాల నుంచి తమ సొంత గ్రామాలకు వెళ్లే పట్టణవాసులు జాగ్రత్తలు, సూచనలు పాటించాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఒక ప్రకటనలో కోరారు. దొంగలు ఇదే సమయాన్ని అదనుగా చేసుకొని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామాలకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలు సూచనలు సలహాలు అందించారు.

- తమ గ్రామానికి వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించమని సమాచారం అందించాలి.
- ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం.
- ఊళ్లకు వెళ్లే వారు ఇంటి లోపల, బయట ఒక లైటు ఆన్ చేసి ఉంచాలి.
- విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు తెలుపరాదు.
- ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ వేయాలి.
- ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదని ఎస్పీ సూచించారు. సీసీ కెమెరాలను ఇంటర్నెట్‌కు అనుసంధానం చేసి మొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచైనా ప్రత్యక్షంగా చూసుకునే సౌకర్యం ఉంటుందన్నారు.
- ఇళ్లలో నుంచి బయటకు వచ్చే ముందు గ్యాస్ సిలిండర్ తప్పని సరిగా ఆఫ్ చేయడం, షార్ట్ సర్క్యూట్ కాకుండా జాగ్రతలు తీసుకోవాలి.
- ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలని ఆయన కోరారు. తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ ఉంచుకోవాలి.
- అనుమానాస్పదంగా వీధుల్లో కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్‌కు సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

వైద్యఖర్చులు ప్రభుత్వమే భరించాలి

- ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్
- హోంగార్డు గోపాల్‌కు పరామర్శ



గోపాల్‌ను పరామర్శిస్తున్న హరీశ్‌రావు, చింతా ప్రభాకర్ తదితరులు

కొండాపూర్(సంగారెడ్డి): మల్కాపూర్ ఎఫ్‌టీఎల్ భవనం కూల్చివేతలో గాయపడిన హోంగార్డు గోపాల్ వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదారాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని మాజీ ఎమ్మెల్యే పెద్దిసుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రమాదం జరిగి ఇన్ని రోజులైనా ఒక్క పోలీస్ ఉన్నతాధికారి కూడా వచ్చి పరామర్శించలేదని విమర్శించారు. హోంగార్డులు అంటే అంత చులకనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదన్నారు.గోపాల్‌కు వైద్య ఖర్చులకు ఇప్పటికే రూ.లక్ష ఖర్చయ్యాయని కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. తలకు దెబ్బ తగిలి మాట పడిపోయిందని, పూర్తిగా మాటలు రావడానికి నాలుగు నెలల పాటు స్పీచ్ థెరపీ అందించాలని డాక్టర్లు చెబుతున్నారని తెలిపారు. ప్రమాదకరమైన డిటోనేటర్లతో పేలుళ్లు చేసినప్పుడు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే గోపాల్ ప్రమాదానికి గురయ్యారన్నారు. ఈ ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. సర్కారు తప్పించుకునే ప్రయత్నం చేయకుండా గోపాల్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా యువజనోత్సవం

సిద్దిపేటజోన్: గ్రామీణ సంస్కృతి ఉట్టిపడేలా ప్రదర్శనలు.. జానపద పాటలకు అనుగుణంగా యువతుల నృత్యాలు.. ఒగ్గుకథలు, కోయడ్యాన్స్ తదితర ప్రదర్శనలతో విపంచి ఆడిటోరియం మారుమోగింది. యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రదర్శనలతో కనువిందు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటీలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఉత్సవాలను జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ వేడుకల్లో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి జయదేవ్ ఆర్య, సెట్విన్ ఇన్‌చార్జి అమినా భాను, నెహ్రూ యువకేంద్ర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



యువజనోత్సవాల్లో కళాకారుల ప్రదర్శనలు

పక్కాగా డిజిటల్ సర్వే

- మంత్రి పొంగులేటి ఆదేశం

సంగారెడ్డి జోన్: కుటుంబ డిజిటల్ కార్డు జారీ కోసం గురువారం నుంచి నిర్వహించే ప్రయోగాత్మక సర్వే పక్కాగా జరపాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, అధికారులు హాజరయ్యారు. కుటుంబ డిజిటల్ కార్డుల సర్వే, నగరాలు, పట్టణ ప్రాంతాల విస్తరణ కోసం ప్రతిపాదనలు, భూముల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల సత్వర పరిష్కారం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు కోసం అర్హులైన లబ్ధిదారుల ఎంపిక, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రెండు గ్రామాలు, అర్బన్‌లో రెండు వార్డులు సర్వే చేయాలన్నారు. 8వ తేదీ వరకు సర్వే పూర్తి చేసి, 9న స్క్రూటిని, 10న సర్వే నివేదిక పంపించాలని చెప్పారు. ప్రతిరోజు ఒక్కో బృందం 30 నుంచి 40 కుటుంబాలకు సంబంధించిన సర్వేను పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకుని, గడువులోపు పూర్తి చేయాలన్నారు. భూముల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరుగా కేంద్రాలను ఈ నెల 15వ తేదీ నాటికి ప్రతి మండలంలో కనీసం ఒక కొనుగోలు కేంద్రాన్ని తప్పనిసరిగా ప్రారంభించాలని, ధాన్యం దిగుబడులను అనుసరిస్తూ అన్ని ప్రాంతాలలో రైతులకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీపీవో సాయిబాబా పాల్గొన్నారు.

బ్రిటీష్ పాలకులను ఎదురించిన యోధుడు



కట్ట బ్రహ్మన విగ్రహావిష్కరణలో కాంగ్రెస్ నేత నీలం మధు, తదితరులు

- 'కట్ట బ్రహ్మన' నేటి యువతకు ఆదర్శం
- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్
- జగిత్యాల జిల్లా వేములవాడలో విగ్రహం ఆవిష్కరణ

పటాన్‌చెరు టౌన్ : బ్రిటీష్ పాలకుల అరాచకాలను ఎదురించి వారి నియంతృత్వంపై కత్తి దూసిన మహా యోధుడు వీరపాండ్య కట్ట బ్రహ్మన అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ కొనియాడారు. జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్ మండలం తుర్తి గ్రామంలో మంగళవారం ముదిరాజ్ యువసేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కట్ట బ్రహ్మన విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ.. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ అరాచకాలను, పన్ను వసూళ్లను ఎదురించి కథన రంగంలోకి దూకి పోరాడిన మహావీరుడు కట్ట బ్రహ్మన అన్నారు. మొదటి ఇంగ్లీష్ సైన్యాధిపతి అలాన్ దొర పెద్ద సైన్యంతో కోటపై యుద్ధానికి వస్తే వారిని తరిమి కొట్టి ఓడించిన ఘనత వీర పాండ్యన్ సొంతమన్నారు. అలాంటి మహానీయుడిని ఆదర్శంగా తీసుకొని ఆ వీరుడు ధైర్య సాహసాలను పునికి పుచ్చుకొని నేటితరం యువత ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ యూత్ నాయకులు పిట్టల వంశీ, నేమురి నరేశ్, కథలాపూర్ ముదిరాజ్ మండల అధ్యక్షుడు నర్సయ్యపల్లి మధు, మాజీ సర్పంచ్ కొలకాని శేఖర్, యువజన సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ నిర్మాణం పూర్తయ్యేనా..!

- రూ.6.70కోట్లతో యార్డు పనులు
- 104 షాపుల నిర్మాణాలకు ప్రణాళికలు
- మూడేళ్లయినా ముందుకు సాగని వైనం



స్లాబ్ దశలో ఆగిపోయిన ఇంటిగ్రేటెడ్ యార్డు నిర్మాణం పనులు


సంగారెడ్డి జోన్: పట్టణంలోని వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అత్యాధునిక సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు ప్రారంభించి మూడేళ్లు పూర్తి కావస్తున్నా పనులు మాత్రం పూర్తి కావటం లేదు. సంబంధిత అధికారులు ప్రణాళికబద్ధంగా పనులు చేపట్టకపోవటంతో పాటు పర్యవేక్షణ లోపంతో పనులు ముందుకు సాగటం లేదు. దీంతో వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు.

- జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో బైపాసు రోడ్డులో రూ.6.70లక్షల అంచనా వ్యయంతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ సముదాయ పనులకు 2021 డిసెంబరు18న అప్పటి మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిపి పనులకు శంకుస్థాపన చేశారు. టెండరు ప్రక్రియ పూర్తి చేసి సంబంధిత కాంట్రాక్టరుకు అప్పగించారు. రెండెకరాల విస్తీర్ణంలో 104 షాపులను నిర్మించే విధంగా ప్రణాళికలతో మార్కెట్ యార్డు సముదాయం నిర్మాణపు పనులు ప్రారంభించారు. ఒక సంవత్సర కాలంలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. అయితే.. నిర్లక్ష్యం, ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టకపోవటంతో పాటు పర్యవేక్షణలోపం కారణంగా ప్రారంభించిన పనులు పిల్లర్లు, స్లాబ్ దశలోనే నిలిచిపోయాయి. మూడేళ్లు గడుస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగటం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో రహదారులు, గల్లీలలో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.
- అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో ఇప్పటి వరకు జరిగిన పనులలో నాణ్యత ప్రమాణాలు లేకుండా జరిగాయని స్థానికులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా, బైపాస్ రోడ్డు, ఓల్డ్ బస్టాండ్ (భవానీ మందిరం). సినిమా థియేటర్ (గంజిమైదానం)లో నాలుగు వారాంతపు సంతలు జరుగుతుంటాయి.
- పట్టణంలోని ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు కూరగాయలు, పూలు, నాన్ వెజ్ కొనుగోలు చేసేందుకు సంగారెడ్డి పట్టణానికి వస్తుంటారు. ఈ సమయాల్లో పట్టణంలోని పలు ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. వాహనదారులతో పాటు ప్రజలు, వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారు.
- వర్షాకాలంతో వ్యాపారాలు జరిగే సమయంలో కురిసిన వర్షానికి, వేసవి కాలంలో ఎండదెబ్బకు కూరగాయలు పాడవటం జరుగుతుంటాయి. వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.
- సంవత్సరంలోగా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నప్పటికీ సరైన సమయంలో సంబంధిత కాంట్రాక్టరుకు బిల్లులు సరైన సమయంలో రాకపోవటంతో పనులు నిలిచిపోయినట్లు సమాచారం.
- ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు మార్కెట్ యార్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోండి

- హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ
- గురువన్నపేట ఘటనపై సీపీ అనురాధకు ఫోన్

సిద్దిపేటకమాన్: కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధి గురువన్నపేటలో జరిగిన అత్యాచార ఘటనపై హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్రస్థాయిలో స్పందించారు. మంగళవారం సీపీ అనురాధతో ఫోన్‌లో మాట్లాడారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత బాలికకు పునరావాసం, కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుకునేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే ఘటనపై పారదర్శకంగా విచారణ జరిపి నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. సీపీ స్పందిస్తూ.. బాలిక ఉన్నత చదువుల కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, అలాగే నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని గవర్నర్‌కు హామీ ఇచ్చారు.



హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

క్లుప్తంగా

రెజ్లింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్, సిబ్బంది

కంగ్టి(నారాయణఖేడ్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీల్లో కంగ్టి ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు గెలవడంతోపాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నిజాంపేటలో సెప్టెంబర్ 28, 29 తేదీల్లో ఈ పోటీలు నిర్వహించారు. పాఠశాలకు చెందిన రమేశ్ (41కేజీ), దినేశ్(51కేజీ), అండర్ 17లో బంగారు పతకాలు, అండర్ 14లో పవన్(45 కేజీ) వెండి పతకం సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాయ్, తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు.

నెల రోజులకు స్వగ్రామానికి మృతదేహం

దుబాయ్‌లో హవేలిఘణాపూర్ మండలం సుల్తాన్‌పూర్ వాసి మృతి



వసురాం(ఫైల్)

హవేళిఘణాపూర్ (మెదక్): దుబాయ్‌కు ఉపాధి కోసం వెళ్లి అనారోగ్యంతో మృతి చెందిన హవేళిఘణాపూర్ మండల వాసి మృతదేహం రెండు నెలల తర్వాత మంగళవారం స్వగ్రామానికి చేరుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సుల్తాన్‌పూర్ తండాకు చెందిన రమావత్ వసురాం(40) ఆగస్టు 22న దుబాయ్ వెళ్లాడు. రెండు రోజులు పని వెళ్లి డబ్బులు పంపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం మరో రెండు రోజులకే వసురాం అనారోగ్యంతో మృతి చెందినట్లు నిజామాబాద్ ఏజెంటు కుటుంబీకులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబీకులు మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ దృష్టికి తీసుకెళ్లగా అక్కడి అధికారులతో మాట్లాడారు. నెల రోజుల తర్వాత మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. మృతుడికి భార్య విజ్జి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

పేదింట్లో మెరిసిన విద్యాకుసుమాలు

ఒకే గ్రామంలో ఇద్దరికి రెండేసి ఉద్యోగాలు



వెంకటకృష్ణాగౌడ్



అబ్దుల్‌సమీత

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని సర్దన గ్రామానికి చెందిన శెగ్గారి వెంకటకృష్ణాగౌడ్ డీఎస్సీలో రెండు ఉద్యోగాలు సాధించారు. పీడీలో రెండో ర్యాంకు సాధించగా, పీఈటీలో మొదటి ర్యాంకు నిలిచారు. అలాగే అదే గ్రామానికి చెందిన మహ్మద్ అబ్దుల్ సమీ లాంగ్వేజ్ పండిత్ హిందీలో మొదటి స్థానంలో నిలువగా, స్కూల్ అసిస్టెంట్ హిందీ విభాగంలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ఇద్దరు యువకులను ఆయా గ్రామస్తులు అభినందించారు.

స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌లో 3వ ర్యాంక్



రేణుక

దుబ్బాక : డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ సబ్జెక్టులో 3వ ర్యాంక్ సాధించింది దుబ్బాక పట్టణానికి చెందిన తేలు రేణుక. తల్లిదండ్రులు నిరక్షరాస్యులు..తండ్రి హన్మాండ్లు అనారోగ్యంతో ఏ పని చేయలేని పరిస్థితి.. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. తల్లి భూదవ్వ ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో స్వీపర్‌గా పని చేస్తుంది. తమ కుటుంబం గడవడా నికి తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని సవాల్‌గా తీసుకొని పట్టుదలతో చదివింది. పరీక్షల్లో 73.87 మార్కులు తెచ్చుకొని 3వ ర్యాంక్ సాధించడంతో గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు. తల్లిదండ్రుల ఎంతో కష్టపడి తనను, చెల్లెలిని చదివించారని, ఇంకా బాగా కష్టపడి చదివి సివిల్స్ సాధించడమే నా లక్ష్యమని, పేదలకు సేవ చేయాలని ఉందని ఈ సందర్భంగా రేణుక తెలిపారు.

పూలు అధరహో



సిద్దిపేట పట్టణంలో బతుకమ్మకు పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

- బతుకమ్మ పండుగతో పూలకు భారీ డిమాండ్
- కొనలేకపోతున్న మహిళలు
- నేటి నుంచి సంబురాలు
- నిమజ్జనాలకు ఏర్పాట్లు పూర్తి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటుగా బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో పూలకు భారీ డిమాండ్ పెరిగింది. మంగళవారం జిల్లా కేంద్రంతోపాటు, ప్రధాన పట్టణాల్లో బతుకమ్మను పేర్చేందుకు వాడే గునుగు, తంగేడు, చామంతి, బంతి, గడ్డి పూలను విక్రయించారు. వీటిని కొనుగోలు చేసేందుకు గాను ప్రజలు భారీ సంఖ్యలో రావడంతో పట్టణాల్లో పండుగ సందడి నెలకొంది. అయితే బతుకమ్మ పూలకు భారీ డిమాండ్ ఏర్పడింది. బతుకమ్మలో వాడే ముఖ్యమైన గునుగు, తంగేడు, బంతి పూలకు డిమాండ్‌ను బట్టి ధరను పెంచారు. సామాన్య ప్రజలు పూలను కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. అలాగే బతుకమ్మలు నిజ్జనం చేసేందుకు చెరువుల వద్ద ఏర్పాట్లు చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోమటి చెరువు, ఎర్రచెరువు, నర్సపూర్ చెరువుల వద్ద ఘాట్లు ఏర్పాటు చేశారు.

పువ్వుల ప్రత్యేకత..

బతుకమ్మ అంటేనే పూల జాతర. ఈ పండుగలో తంగేడు, గుమ్మడి, బంతి, గునుగు, రుద్రాక్ష, మందారం తదితర అనేక రకాల పూలను వాడుతారు. ఈ పూలను ఒక క్రమ పద్ధతిలో పేర్చుతారు, ఈ పేర్చటంలో కూడా మహిళలు నైపుణ్యాన్ని వాడుతారు. దీంతోపాటు బతుకమ్మను పేర్చటంలో వాడే పూలు అనేక ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. వీటితో పర్యావరణంతోపాటుగా మానవులకు, సహచర జీవులకు మేలు చేస్తాయి.

తంగేడు..



ఫ్యాబేసి కుటుంబానికి చెందిన తంగేడు పువ్వును నీటిలో వేయడం ద్వారా నీటిలోని బ్యాక్టీరియా నశించిపోతుంది. ఈ తంగేడులో జ్వరాన్ని తగ్గించే గుణం ఉంది. దీంతోపాటు అతిమూత్ర వ్యాధిని(మధుమేహాన్ని), మూత్రకోశ వ్యాధులను తగ్గించే ఔషధాల తయారీలో ఈ మొక్క బెరడులను వాడుతారు.

గుమ్మడి..

పొడిబారిన చర్మం ఉన్న వారు ఈ గుమ్మడిని వాడటం ద్వారా పొలుసులు రాలటం తగ్గుతుంది. గుమ్మడిలో ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల ఈ గుమ్మడి మహిళలు అత్యధిక లాభం చేకూరుస్తుంది.

బంతి..

ఆస్టరేసీ కుటుంబానికి చెందిన బంతి శాస్త్రీయ నామం క్సంథిమమ్ బయాన్కో. ఇది మానవుల్లోని వేడిని ఇట్టే హరింపజేస్తుంది. అందువల్ల దీనిని శరీరంలో వేడి ఉండే మహిళలు తలపై ధరిస్తే వేడి తగ్గుతుంది. దీంతోపాటుగా గొంతు సంబంధిత వ్యాధులను కూడా బంతి తగ్గిస్తుంది.

గునుగు..



అమారాంథేసీ కుటుంబానికి చెందిన గునుగు శాస్త్రీయ నామం సిలోసియా అర్జెంటీయా. ఇది ప్రకృతిలో విరివిగా లభిస్తుంది. ఇది పశువులకు ఆహారంగా వేయడం ద్వారా పశువుల్లో వచ్చే అనేక వ్యాధులను నివారిస్తుంది. అదే విధంగా నీటిలో వేయడం ద్వారా నీటిలోని బ్యాక్టీరియా, మలినాలను తదితర వాటిని హరించేస్తుంది.

రుద్రాక్ష..

రుద్రాక్షను ఎలియోక్రాపాస్ గాంట్రిస్ అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. ప్రతీ పల్లెల్లో ప్రతీ ఇంట్లో ఉండే పూల మొక్క రుద్రాక్ష. దీనిని చంద్రకాంత పుష్పం అని కూడా పిలుస్తారు. ఇది చర్మవ్యాధుల నివారిణిగా పేరుగాంచింది. ఈ పువ్వు గింజలు నీటిలో వేసుకొని స్నానం చేయడం ద్వారా చర్మవ్యాధులకు మంచి ఔషధంగా పని చేస్తుంది. దీనిని వివిధ ఆయుర్వేదిక్ ఔషధాల తయారీలో విరివిగా ఉపయోగిస్తున్నారు.

మందారం..



మందారం ఔషధ గుణాలకు సంబంధించి మహిళలకు బాగా తెలుసు. వెంట్రుకల సమస్యలతో బాధపడే వారికి ఈ మందారం పువ్వు చాలా ఉపయోగపడుతుంది. వెంట్రుకలను నల్లగా ఉంచడం కోసం, రాలకుండా ఉండేందుకు వినియోగిస్తారు. అతిసార వ్యాధితో బాధపడే వారికి ఈ మందారం దివ్య ఔషధంగా పని చేస్తుంది.

గ్రీనరీ పేరుతో ప్రజాధనం వృథా



వాకింగ్ ట్రాక్‌పై చెత్తాచెదారం, ముళ్లపొదలు



నిరుపయోగంగా కుండీలు

- జిల్లా ప్రధాన రహదారి వెంట పేరుకుపోయిన చెత్తాచెదారం
- నిరుపయోగంగా కుండీలు
- ముళ్లపొదల్లో వాకింగ్ ట్రాక్
- పాదాచారులకు తప్పనితిప్పలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

సంగారెడ్డి : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి బల్దియాలో అవినీతి రాజ్యమేలుతోంది. గ్రీనరీ పేరుతో ఎన్నో రూ.లక్షలు వెచ్చించి పూల కుండీలను ప్రధాన రహదారి వెంబడి ఏర్పాటు చేశారు. ఇందులో మరి కొన్ని నిధులు వెచ్చించి చెట్లు ఏర్పాటు చేసి కొద్ది రోజులు పర్యవేక్షించారు. అనంతరం వాటిని గాలికి వదిలేయడంతో చెట్లు ఎండిపోయాయి. అలాగే, కలెక్టర్ కార్యాలయం నుంచి సీఎస్‌ఐ చర్చి వరకు రూ.లక్షలు వెచ్చించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. రెండేళ్లుగా ట్రాక్‌ను పట్టించుకోకపోవడంతో చెత్తాచెదారం, ముళ్ల పొదలు పెరిగిపోయాయి. చెట్లని రోడ్లపైకి వచ్చి వాకింగ్ ట్రాక్‌ను కమ్మేశాయి. దీంతో ట్రాక్ నిరుపయోగంగా మారింది. కలెక్టర్ ఉన్నతాధికారులు నిత్యం వెళ్లే దారి పరిస్థితి ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇకనైనా ఉన్నతాధికారుల స్పందించి జిల్లా కేంద్రంలో గ్రీనరీని పెంచి వాకింగ్ ట్రాక్‌లకు మరమ్మతులు చేయాలని పరువులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్, మున్సిపాలిటీ డీఈని సంప్రదించగా వారు అందుబాటులో లేకపోవడం గమనార్హం.

ట్రాక్‌పై నడవలేకపోతున్నాం

కలెక్టరేట్ కార్యాలయం నుంచి సీఎస్‌ఐ చర్చి వరకు గతంలో వాకింగ్ ట్రాక్ బాగా ఉండేది. దానిపై రకరకాల పూల చెట్లు పెట్టి పర్యవేక్షించారు. అనంతరం వాటిపై నిర్లక్ష్యం వహించడంతో నిరుపయోగంగా మారాయి. వాకింగ్ ట్రాక్‌పై ముళ్లపొదలు పెరిగి నిత్యం నడవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఉన్నతాధికారుల స్పందించి వాకింగ్ ట్రాక్‌ల మరమ్మతులు చేసి గ్రీనరీని పెంచాలి.

– మురళీధర్, సంగారెడ్డి

ప్రజాధనం వృథా చేస్తున్నారు

సంగారెడ్డి మున్సిపల్ అధికారులు ఏదో పేరుతో ప్రజాధనం వృథా చేస్తున్నారే తప్ప ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. ప్రతీనిత్యం చెత్త వేస్తున్నారని, మూత్రవిసర్జన చేస్తున్నారని ఫైన్లు వేస్తున్నారే తప్ప ప్రజలకు సౌకర్యవంతమైన పనులు చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల మేలు కోసం పనులు చేయాలి.

– నర్సింలు, సంగారెడ్డి

ప్రకృతిని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న అయోధ్యరెడ్డి

గజ్వేల్: అభివృద్ధి పేరుతో ప్రకృతిని ధ్వంసం చేస్తున్నారని, ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి, నేచర్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ అయోధ్యరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సీఏటీసీ క్యాంప్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతిని పరిరక్షించుకుంటేనే మానవ అభివృద్ధి ముందుకు సాగుతుందన్నారు. త్రీఆర్(రియూస్, రెడ్యూస్, రీసైకిల్)ను పాటించడం వల్ల ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించొచ్చన్నారు. మానవజాతిని పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్య ప్లాస్టిక్‌ను నివారించకపోతే రాబోయే కాలంలో పర్యావరణ సమతుల్యం దెబ్బతిని ప్రకృతి వైపరీత్యాలు సంభవించే ప్రమాదముందన్నారు. ఎన్‌సీసీ కాడెట్లు సెల్ఫీ విత్ మై ప్లాంట్ వంటి వినూత్న కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదే విధంగా ఇళ్లలో తడి, పొడి చెత్తను వేరు చేసే విధానం, కంపోస్టు తయారీ, మొక్కల పెంపకం, సీడ్ బాల్ విధానం వంటివాటిపై కాడెట్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆడమ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు, సుబేదార్ మేజర్ రామ్‌హరి, ఏఎస్‌వో డాక్టర్ మహేందర్‌రెడ్డి, కాడెట్లు, తదితరులు పాల్గొన్నారు.

పూల పండుగగా బతుకమ్మ ప్రత్యేకం



బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ ఆడబిడ్డలు జరుపుకునే పూల పండుగ ప్రపంచంలోనే ప్రత్యేకమైందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. కళాశాల మహిళా సాధికారత విభాగం, ఎన్‌ఎస్‌ఎస్‌ల ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మంగళవారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ఆయా విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు బతుకమ్మలను పూలతో పేర్చి ఆడిపాడి అలరించారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్తుపిండి, పండ్లు, పులిహోర, నిమ్మహోర తదితర సుమారు 35రకాల ఫలహారాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ లీలావతి, మహిళా గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ శైలజ, ఎన్‌సీసీ కేర్‌టేకర్ డాక్టర్ భవానీ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా.రాణి, డా.పుణ్యమ్మ, టీఎస్‌కేసీ కన్వీనర్ డా. ఉమామహేశ్వరీ, సాంస్కృతిక విభాగాధిపతి మట్ట సంపత్‌రెడ్డి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కూతురిని చంపిన తండ్రికి జీవిత ఖైదు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి):సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కన్న కూతురినే కడతేర్చిన హత్య కేసులో తండ్రికి జీవిత ఖైదు, జరిమాన విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి జీ.భవానీ చంద్ర మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. కాట్రోత్ రవి నాయక్ (41) తన మొదటి భార్య చనిపోవడంతో రెండో భార్యతో కలిసి సదాశివపేట మండల పరిధిలోని ఆత్మకూర్ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. మొదటి భార్య కుమార్తె రేణుక (13) వికారాబాద్ జిల్లా నవాబ్ పేట కస్తూర్బా పాఠశాలలో చదువుతుంది. ఆరోగ్యం బాగా లేక చికిత్స కోసం 2020లో సదాశివపేటకు తీసుకొచ్చాడు. తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో గొంతు నులిమి చంపి, జ్వరంతో చనిపోయిందని చెప్పి అనుమానం రాకుండా సాక్ష్యాధారాలు లేకుండా చేశాడు. ఈ విషయంపై గతంలో వీఆర్వో చేసిన ఫిర్యాదు మేరకు సీఐ శ్రీధర్ రెడ్డి కేసు నమోదు నిందితుడి అరెస్ట్ చేశారు. కేసు విచారణలో భాగంగా కోర్టులో హాజరు పర్చగా జడ్జి నేరస్థుడికి జీవిత ఖైదు, రూ.500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మరో 15 రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.250 జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ దోషిగా తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన సీఐలు శ్రీధర్ రెడ్డి, మహేశ్ గౌడ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ, కోర్ట్ డ్యూటీ హెడ్ కానిస్టేబుల్స్ రవి, వెంకటేశ్వర్లు, కోర్ట్ లైజనింగ్ అధికారి కె.సత్యనారాయణను ఎస్పీ చెన్నూరి రూపేశ్ అభినందించారు.

ఫోన్ మాట్లాడుతూ ప్రాణాల మీదికి..

- ట్రాన్స్‌ఫార్మర్ వైరు తగిలి విద్యుదాఘాతంతో యువకుడు మృతి



నర్సింలు (ఫైల్)

జోగిపేట(అందోల్): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన అన్నాసాగర్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అన్నాసాగర్ గ్రామానికి చెందిన ఎర్రంకి నర్సింలు (28) మంగళవారం ఫోన్ మాట్లాడుతూ అజాగ్రత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైరును తాకాడు. దీంతో కరెంట్ షాక్ తగిలి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చుట్టుపక్కల వారు జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న జోగిపేట సీఐ అనిల్ కుమార్, ఎస్సై పాండు సిబ్బందితో ప్రభుత్వాస్పత్రికి వెళ్లి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి తండ్రి రాములు ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..



ఘటనా స్థలంలో కృష్ణ మృతదేహం

వర్గల్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం వర్గల్ మండలం గిర్మాపూర్ సమీపంలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. ములుగు మండలం బైలంపూర్ ఆర్అండ్‌ఆర్ కాలనీకి చెందిన పూసల కృష్ణ (50) ఎక్సెల్ మోపెడ్ ద్విచక్రవాహనంపై గ్రామాల్లో తిరుగుతూ అప్పడాలు, మసాలాలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు. రోజు మాదిరిగా మంగళవారం బయటకు వెళ్లిన అతడి వాహనాన్ని గిర్మాపూర్ సమీపంలో బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలై కృష్ణ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి భార్య పుష్పమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య కాపురానికి రావడం లేదని..

- ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



నర్సింలు(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): భార్య కాపురానికి రావడం లేదని ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని సదాశివపల్లి పంచాయతీ పరిధిలోని పాంపల్లిలో మంగళవారం చోటు చేసుంది. ఏఎస్ఐ శ్రీనివాస్, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పాంపల్లి గ్రా మానికి చెందిన గాదె నర్సింలు(30) తాపీమేస్త్రీ పనులు చేస్తుండేవాడు. 2010లో వెల్దుర్తి మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన మౌనికతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి నచ్చజెప్పారు. భర్త మద్యం తాగి రోజు కొడుతు న్నాడని ఆరు నెలల కిందట మౌనిక పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. కొద్దిరోజులకు కాపురానికి రావాలని కోరగా ఆమె రాలేదు. దీంతో మద్యానికి బానిసైన నర్సింలు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇస్నాపూర్‌లో కార్మికుడు..

పటాన్‌చెరు టౌన్: ఉరి వేసుకొని కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరులో చోటు చేసుకుంది. ఎస్ఐ అభిమాన్‌సింగ్ కథనం మేరకు.. వికారాబాద్‌కు చెందిన మానయ్య, కుమారుడు ప్రకాశ్(25) ఇస్నాపూర్‌లో ఉంటూ ఓ పరిశ్రమలో కూలీ పని చేసుకుంటున్నారు. తండ్రి కూలీ పనికి మంగళవారం తెల్లవారుజామున వెళ్లాడు. కొద్దిసేపటికే ప్రకాశ్ ఇంట్లో బెడ్ రూమ్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య చూసేసరికి వేలాడుతు కన్పించగా పక్కన వాళ్ల సాయంతో తలుపు పగులగొట్టి కిందకి దింపి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తన కుమారుడు అనారోగ్య గానీ, మరే ఇతర కారణంతోనైనా ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మానవ వ్యర్థంతో ఎరువులు తయారీ

నేడు మంత్రి చేతుల మీదుగా ఎఫ్‌ఎస్‌టీపీ ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: పర్యావరణ హితమే ధ్యేయంగా హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు మత్తడి సమీపంలో ప్రియధర్ గ్రీన్ ఎన్విరాన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎకరం స్థలంలో రూ.1.10 కోట్ల వ్యయంతో మానవ వ్యర్థాల శుద్ధీకరణ (ఎఫ్ఎస్‌టీపీ) ప్లాంట్‌ను నిర్మించారు. ఈ ప్లాంట్‌ను అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, కమిషనర్ మల్లికార్జున్, తదితరులు పరిశీలించారు. ప్లాంట్ లోపల మొక్కలు పెంచి ఉద్యానవనంగా తీర్చిదిద్దారు. ప్రహరీ గోడలపై పర్యావరణ పరిరక్షణ కోసం అందరినీ ఆకట్టుకునేలా బొమ్మలు గీశారు. నిండిన సెప్టిక్ ట్యాంక్‌ల్లోని వ్యర్థాలతో ఎరువులు తయారు చేయడమే ఈ శుద్ధి ప్లాంట్ లక్ష్యం. ఇళ్లలో సెప్టిక్ ట్యాంకులు నిండితే మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇస్తే ఎలాంటి రుసుం లేకుండా వ్యర్థాలు తీసుకెళ్తారు. ఈ తయారీ కేంద్రంలో ప్రతి రోజూ 300 కిలోల ఎరువులు తయారుచేయనున్నారు. 10 కేఎల్‌డీ కెపాసిటీ ఉన్న ఈ ఎరువుల తయారీ కేంద్రంలో 10 వేల లీటర్ల మానవ మల వ్యర్థాలను తీసుకుంటారు. వ్యర్థాలతో తయారైన ఎరువులను రైతులకు చౌకగా అందించేందుకు మున్సిపల్ ప్రత్యేక ప్రణాళిక రూపొందించనుంది.

నాడు ‘దర్జా’గా.. నేడు దీనంగా



వెల్దుర్తిలో బట్టలు కుడుతున్న దర్జీలు



ఓ షాపులో రెడిమేడ్ దుస్తులు

- కల తప్పిన టైలరింగ్ షాపులు
- పండుగ రోజుల్లోనూ పని కరువు
- ఆందోళనలో దర్జీల కుటుంబాలు

వెల్దుర్తి(తూప్రాన్) : పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఒకప్పుడు దర్జాగా వెలుగొందిన ‘దర్జీ’ల బతుకులు నేడు వెలవెలబోతున్నాయి. పండుగ వచ్చిందంటే చాలు రెండు, మూడు నెలల నుంచే చేతినిండా పని ఉండేది. పని దొరికినప్పుడే కాసిన్ని డబ్బులు కూడబెట్టుకోవాలని రాత్రింబవళ్లు నిద్రాహారాలు మాని కష్టపడేవారు. దసరా పండుగ వచ్చిందంటే కనీసం నెల ముందే క్లాత్ కొనుగోలు చేసి ఇస్తే తప్ప సమయానికి టైలర్లు దుస్తులు అందించలేని పరిస్థితి. దీంతో పండుగ సమయాల్లో దుకాణాలన్నీ వచ్చిపోయే వారితో నిత్యం కళకళలాడేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుతం రెడీమేడ్ దాటికి దర్జీలు విలవిలలాడుతున్నారు.

టైలరింగ్ నేర్చుకునే వారేరి..

గతంలో టైలరింగ్ పని నేర్పించేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను షాపులకు పంపేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. అసలు టైలరింగ్ నేర్చుకుందామంటేనే నేర్పేవారు కరువయ్యారు. యువత మార్కెట్‌లో లభించే రెడీమేడ్ దుస్తులనే కోరుకుంటుందని, నాణ్యత పట్టించుకోవడం లేదని దర్జీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళ తప్పుతున్న దుకాణాలు

దర్జీ దుకాణాలు కళ తప్పుతున్నాయి. రెడీమేడ్ దుస్తులు మార్కెట్‌లోకి రావడంతో ఎక్కువ శాతం యువత ఆకర్శితులవుతున్నారు. దీంతో చిన్ననాటి నుంచి చేతి పనినే నమ్ముకున్న టైలర్లు ఉపాధి కోల్పోతున్నారు. పనిలేక విలవిలలాడిపోతున్నారు.ప్రస్తుతం దర్జీ వృత్తికే గడ్డుకాలం ఏర్పడింది.

ఖాళీగా ఉంటున్నాం



గతంలో పండుగలు వస్తున్నాయంటే తీరికలేక బట్టలు కుట్టేవాళ్లం. ప్రస్తుతం దసరా పండుగ సమయంలో కూడా సరిగా పని దొరకడం లేదు. రెడీమేడ్ దుస్తుల వల్ల మాకు ఉపాధి కరువవుతుంది. దీంతో కుటుంబ పోషణ భారమవుతోంది. ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, బీమా సదుపాయం, హెల్త్ కార్డులు తదితర సౌకర్యాలు మాలాంటి టైలర్స్‌కు కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– శేఖులు, టైలర్, వెల్దుర్తి

పెరిగిన మెటీరియల్ ధరలు

మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగాయి. ప్యాంటు, చొక్కా కుట్టినందుకు రూ.800 నుంచి రూ.900 వరకు వసూలు చేస్తున్నారు. దుకాణంలో రోజువారీగా పని చేసే వర్కర్‌లకు ఒక్కో పీసుకు రూ.200 నుంచి రూ.300 వరకు చెల్లిస్తున్నారు. వీటితోపాటు దుకాణాల అద్దెలు, కరెంటు చార్జీలు సైతం పెరిగిపోవడంతో టైలరింగ్ షాపు నడపడం కష్టమైపోతుందని వాపోతున్నారు. రోజుకు ఐదారు జతలు కుడితే తప్ప పూటగడవని పరిస్థితి. అరకొరగా వస్తున్న దుస్తులను వెంటనే కుట్టిపెట్టినా తీసుకెళ్లడం లేదని దర్జీలు వాపోతున్నారు.